## మంత్రి శ్రీనన్నకు

# పీఆర్టీయూ మద్దతు

- కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు
- ఎన్నికల వేళ మాయమాటలు నమ్మి ఆగం కావొద్దు
- రైతుల ఆకలి తీర్చేందుకు మార్కెట్ యార్డులో ఉచిత భోజనం
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలమూరు జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- బీఆర్‌ఎస్‌కు జైకొట్టి మంత్రిని సన్మానించిన పీఆర్టీయూ నేతలు

పాలమూరు, అక్టోబర్ 7 : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన పీఆర్టీయూ టీఎస్ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఆర్టీయూ నాయకుడి కుమారుడిగా, ఉద్యోగ సంఘాలు, ఉద్యమ నేతగా ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రత్యేక అభిమానంతో పనిచేస్తామని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకుడు, ఉద్యమనేత అయిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించే బాధ్యత తాము తీసుకుంటున్నట్లు పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్, సంఘం నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, సహ యునియన్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**అభివృద్ధిని గుర్తించాలి**

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 7 : కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని ఆబ్కారీ, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తిరుమలహిల్స్‌లో నిర్మించే రెడ్డి సంఘం కన్వెన్షన్ హాల్, జేజేఆర్ గార్డెన్ సమీపంలో హజ్‌హౌస్, ఖురేషీ ఫంక్షన్ హాల్, ఏనుగొండలో యాదవసంఘం, బోయపల్లిలో రెడ్డిసంఘం కమ్యూనిటీ హాల్, తూర్పు కమాన్ వద్ద జామియా మసీద్ సమీపంలో కమ్యూనిటీ హాల్, మార్కెట్ యార్డు సమీపంలో ఈద్గా ప్రహరీ పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ చేశారు. కొత్తగంజిలో గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. అన్ని రంగాల్లో రాష్ట్రం దూసుకుపోతున్నదన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చేప్పే వారిని నమ్మొద్దని, కండ్ల ముందు జరుగుతున్న అభివృద్ధిని గమనించాలన్నారు. హజ్‌హౌస్ నిర్మాణాన్ని కొంతమంది అడ్డుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అందరికీ అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్‌లో మైనార్టీల కోసం 6 గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. వాటినే ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేశామని, వచ్చే ఏడాది డిగ్రీ కళాశాలలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ వెంకన్న, డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, వైస్‌చైర్మన్ గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఏనుగొండలో యాదవ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ఆడిటోరియం పనులకు శంకుస్థాపన**

మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో రూ.5కోట్లతో నిర్మించనున్న ఆడిటోరియం పనులకు మంత్రి శనివారం భూమిపూజ చేసి మాట్లాడారు. తాను చదివిన కళాశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మరిన్ని నిధులు తీసుకొచ్చి కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రికి కృతజ్ఞతగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు పాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ముడా చైర్మన్ వెంకన్న, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రైతులకు భోజనశాల ప్రారంభం**

మార్కెట్ యార్డులో రైతుల కోసం రూ.27లక్షలతో నిర్మించిన ఉచిత భోజనశాల, రూ.30లక్షలతో నిర్మించిన వాటర్‌ట్యాంక్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం హమాలీలు, దడవాయిలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకొచ్చిన రైతుల ఆకలి తీర్చేందుకు ఉచిత భోజనశాల ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డైరెక్టర్లు, వ్యవసాయ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారే..

- రాష్ట్రంలో హంగ్ ఏర్పడడమనేది అవాస్తవం
- సీఎం కేసీఆర్ హయాంలో అందరికీ లబ్ధి
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తృత పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభం



అంకూర్‌లో యువకులకు స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 7: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. జడ్చర్లలోని బాదేపల్లి పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో నాబార్డు నిధులు రూ.1.87కోట్లతో నిర్మించిన (2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం) గోదాంను శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోదాంల నిర్మాణానికి స్థలం ఇచ్చిన రైతులు, సహకరించిన వారితోపాటు సింగిల్‌విండో పాలకవర్గాన్ని మంత్రి, ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. అనంతరం ఇటీవల బీజేపీ నాయకులు రాష్ట్రంలో హంగ్ వస్తుందని చేసిన వ్యాఖ్యలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. హంగు లేదు.. బొంగు లేదు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ అనుకూల విధానాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. దీంతో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో ఇదివరకు ఉన్న వేర్‌హౌస్ గోదాంల నిల్వ సామర్థ్యం 4లక్షల మెట్రిక్‌టన్నులేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 70లక్షల సామార్థ్యానికి పెంచామన్నారు. జడ్చర్ల పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో పీఏసీసీఎస్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆరెకరాల భూమిని తీసుకొని 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాంను నిర్మించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మి, సర్పంచ్ ప్రణీల్‌చందర్, కౌన్సిలర్లు లత, నవనీత, కొండల్, ముడా డైరెక్టర్ ఇంతియాజ్‌ఖాన్, శ్రీకాంత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

**ప్రతి కుటుంబానికి లబ్ధి**

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 7 : సీఎం కేసీఆర్ ఆలోచనా విధానాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతున్నదని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం బలీదుపల్లి, కన్మనూరులో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంబండ వర్గాల అభివృద్ధితో ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తున్నదన్నారు. దేశమంతా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం కావాలని కోరుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి వనపర్తి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, అడ్డాకల్ ఎంపీపీ నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పెద్దమందడి మండల అధ్యక్షుడు వేణుయాదవ్, సర్పంచులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# ప్రతిపక్షాలను నమ్మొద్దు

- సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- మద్దూరు మండలంలో గురుకుల, హైస్కూల్ భవనానికి శంకుస్థాపన
- హాజరైన కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్ (కొత్తపల్లి) అక్టోబర్ 7 : ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు చెప్పే మాయమటలను నమ్మొద్దని ప్రజలకు సమాచార శాఖ మంత్రి పట్నం నరేందర్‌రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. శనివారం మద్దూర్‌లో గురుకుల పాఠశాల నూతన భవన సముదాయనికి రూ.5కోట్లతో శంకుస్థాపన, రేణివట్లలో మన ఊరు–మన బడిలో భాగంగా హైస్కూల్ నూతన భవనానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేసి, స్వార్థ రాజకీయాలు చేశారని విమర్శించారు. స్వరాష్ట్రంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సలీం, పీఏసీసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, సర్పంచ్ అరుణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

MBA/B.Ed
Seats are available with or without entrance
SHADNAGAR
9866958815
9392639172